రేపు జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలికల ఎంపిక పోటీలు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 14: మండలంలోని సుద్దపల్లి గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 16న సబ్‌జూనియర్ జిల్లా సాఫ్ట్‌బాల్ బాలికల జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మార్కంటి గంగామోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 2010 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఉదయం 10 గంటలకు సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ వి.మౌనికకు రిపోర్టు చేయాలని సూచించారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు కేజీబీవీ విద్యార్థిని

కంఠేశ్వర్, అక్టోబర్ 14 : తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఈనెల 15 నుంచ 17 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా సౌత్ జోన్ ఖోఖో నేషనల్ టోర్నమెంట్‌కు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి బాల్కొండలోని కేజీబీవీ విద్యార్థిని ఏలేటి మైథిలి ఎంపికైనట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అతీఖుల్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైథిలిని ఉమ్మడి జిల్లా ఖో ఖో అసోసియేషన్ ప్రతినిధులు బిల్లా అనిల్, జీవీ భూమారెడ్డి, నోముల మధుసూదన్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు సోమవారం అభినందించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు తూంపల్లి విద్యార్థులు..

సిరికొండ, అక్టోబర్ 14 : ఇటీవల ఆర్మూర్‌లో నిర్వహించిన సీనియర్ జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో తూంపల్లి విద్యార్థులు రంజిత్, గోపాల్, వినోద్, మనోజ్, నితిన్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారు. రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ఈనెల చివరి వారంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తారని పీఈటీ నగేశ్ తెలిపారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవాలు

ధర్పల్లి, అక్టోబర్ 14: మండల కేంద్రంలోని శ్రీ రేణుకా దేవీ ఎల్లమ్మ ఆలయ పంచమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులోభాగంగా సోమవారం ఆలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించారు. ఈ నెల 22 వరకు ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూర్, అక్టోబర్14 : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10వ తరగతులతో పాటు ఇంటర్ భౌతిక శాస్త్రం బోధించడానికి అర్హులైన అభ్యర్థులు మంగళవారం కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

సీనియర్ న్యాయవాది మృతికి సంతాపం

వినాయక్‌నగర్,అక్టోబర్14 : బోధన్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ మాజీ సభ్యుడు గాదే సత్యనారాయణ మూర్తి మృతి పట్ల నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ ఆధ్వర్యంలో సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో న్యాయసేవలు అందించారని కొనియాడారు. తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్ రెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు రాజు, వసంత్ రావు, సురేశ్, దీపక్, సంగమేశ్వర్ రావు, కృపాకర్ రెడ్డి, ఆకుల రమేశ్, మానిక్ రాజు, మధుసూదన్ రావు, సుదర్శన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

రేపు జిల్లాలో రాష్ట్ర సదస్సు

ఖలీల్‌వాడి, అక్టోబర్ 14: జిల్లా కేంద్రంలోని శ్రావ్యగార్డెన్స్‌లో ఈ నెల 16న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా బాధ్యులు సోమవారం తెలిపారు. ఎస్సీ వర్గీకరణ, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకపోవడం తదితర అంశాలపై చర్చించనట్లు పేర్కొన్నారు. సదస్సుకు 33 జిల్లాల ఎమ్మార్పీఎస్ శ్రేణులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు రానున్నారని తెలిపారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

- నవంబర్ 14 వరకు శిబిరాలు
- జిల్లా పశు వైద్యాధికారి జగన్నాథచారి

ఖలీల్‌వాడి, అక్టోబర్ 14: జిల్లాలో నేటి నుంచి నవంబర్ 14 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా పశు వైద్యాధికారి జగన్నాథచారి సోమవారం తెలిపారు. రైతులు తమ పశువులు ఆవులు, లేగలు, దూడలు, గేదెలకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. జిల్లాలో సుమారు 2.52 లక్షల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలాల వారీగా టీకా, మందులు, సిరింజీలను సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు.

మండలాల్లో..

జక్రాన్‌పల్లి/ ఆర్మూర్ టౌన్/ రెంజల్/ రుద్రూర్, అక్టోబర్ 14: జక్రాన్‌పల్లి మండలంలో అన్ని గ్రామాల్లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ప్రారంభించనున్నట్లు మండల వైద్యాధికారిణి శిరీష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు కొలిప్యాక్ గ్రామంలో పశువులకు టీకాలు వేస్తామని పేర్కొన్నారు. ఈనెల 16న కలిగోట్, 17న చింతలూర్, 18న బ్రాహ్మణ్‌పల్లి, 19న తొర్లికొండ, 21న మునిపల్లి, 22న నల్లగుట్ట తండా, 23న లక్ష్మాపూర్, 24న నారాయణపేట్, 25న అర్గుల్, 26న పుప్పాలపల్లి, 28న మాదాపూర్, 30న గన్యతండా, నవంబర్ ఒకటిన సికింద్రాపూర్, 2న కేశ్‌పల్లి, 4న పడకల్, 6న మనోహర్‌బాద్, 9న వివేక్‌నగర్ తండా, 11న జక్రాన్‌పల్లిలో శిబిరాలను ఏర్పాటు చేస్తామని వివరించారు. పాడి రైతులు తమ పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలను తప్పకుండా వేయించాలని సూచించారు. ఆర్మూర్, రెంజల్ మండలాల్లో నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్మూర్, రెంజల్ మండల పశు వైద్యాధికారులు లక్కం ప్రభాకర్, విఠల్ సోమవారం వేర్వేరుగా ఒక ప్రకటనలో తెలిపారు.

రుద్రూర్ మండలంలో..

రుద్రూర్ మండలంలో ఈ నెల 15, 16న బొప్పాపూర్, 17,18న అక్బర్‌నగర్, 19న లక్ష్మీపూర్ క్యాంపు, 21,22 న అంబం, 24న కొండాపూర్, 24,25న చిక్కడ్‌పల్లి, 26,28న సులేమాన్ నగర్, 29,30న రాణంపల్లి, నవంబర్ 1,2న రాయకూర్, 4,5న రాయకూర్ క్యాంపు, 5న సిద్దాపూర్, 6న సిద్దాపూర్ క్యాంపులలో జీవాలకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాదికారి సంతోష్‌కుమార్ సోమవారం తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ

పొతంగల్, అక్టోబర్14: మండలంలోని జల్లాపల్లి, లింగాపూర్ గ్రామా ల శివారులో ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ కాయిల్స్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఆదివారం రాత్రి కాయిల్స్ చోరీ చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందపడేసినట్లు ఏఈ నర్సారెడ్డి సోమవారం తెలిపారు. జల్లాపల్లి శివారులో ఒకటి, లింగాపూర్ శివారులో రెండు వ్యవసాయ క్షేత్రాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

కింద పడి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

బీజేపీ నాయకుల రాస్తారోకో

రుద్రూర్, అక్టోబర్14: సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయాన్ని దుండగులు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు రుద్రూర్ మండల కేంద్రంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఆలయంపై దాడిచేసిన వారిని గుర్తించి వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలానికి స్థానిక ఎస్సై సాయన్న, సీఐ జయేశ్‌రెడ్డి చేరుకొని ఆందోళనకారులను స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుధాకర్‌గౌడ్, శ్యామ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులకు యువతి బలి

ఇందల్వాయి, అక్టోబర్ 14 : అదనపు కట్నం వేధింపులకు ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. స్థానిక ఎస్సై మనోజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివనగర్ మండలం దగ్గి గ్రామానికి చెందిన మనోజ(25)ను చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన సాయిలుకు ఇచ్చి 2016లో పెండ్లి చేశారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సాయిలు వ్యవసాయం చేస్తున్నాడు. కొంతకాలంగా అదనపు కట్నం కోసం భార్యను వేధించసాగాడు. వేధింపులు తట్టుకోలేక మనోజ ఆదివారం రాత్రి చంద్రాయన్‌పల్లి శివారులోని పెద్దపోచమ్మ గుడి దగ్గర చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి అన్న మూడెల్ల సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

మనోజ (ఫైల్)

డీజే యజమానులపై కేసు నమోదు

వినాయక్‌నగర్/శక్కర్‌నగర్, అక్టోబర్14: డీజేలను వాడొద్దని సూచించినా వినకుండా వాటిని ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్రంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధించిన డీజేలను పెట్టిన ఆకుల సంపత్, నవీన్, ఆదిత్యపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాసిర్ ఆరాఫత్ వెల్లడించారు. దీంతో పాటు వారికి సంబంధించిన డీజేలను సీజ్ చేసినట్లు తెలిపారు.

బోధన్‌లో ఇద్దరిపై..

బోధన్‌లో దుర్గామాత నిమజ్జనోత్సవ శోభాయాత్ర సందర్భంగా నిబంధనలు అతిక్రమించి డీజేలు పెట్టిన యజమానులపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు. శబ్దకాలుష్య నివారణలో భాగంగా డీజేలు వినియోగించరాదని, సీపీ ఆదేశాల మేరకు డీజే యజమానులకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. బోధన్‌లో డీజేలు ఏర్పాటు చేసిన యజమానులు లక్ష్మణ్, మహేశ్‌పై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలుగొద్దు..

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కంఠేశ్వర్, అక్టోబర్ 14 : ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుతో కలిసి సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించినట్లు తెలిపారు. ఆయా చెరువుల్లో చేప పిల్లల విడుదలకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని, నాణ్యమైన చేప పిల్లలు పంపాలని కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. చేప పిల్లలను పంపిణీ చేసే ముందు స్థానిక నాయకులు, చేపల పెంపకందారులకు ముందుగానే సమాచారం ఇస్తామన్నారు.

నేడు డీఎస్సీ అభ్యర్థులకు కౌన్సెలింగ్

ఖలీల్‌వాడి, అక్టోబర్ 14 : నియామక పత్రాలు పొందిన డీఎస్సీ-2024 అభ్యర్థులు (ఎస్జీటీ, లాంగ్వేజ్ పండిట్, పీఈటీ) కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయం (రూం నంబర్ :103)లో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గా ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్లు (అన్ని సబ్జెక్టులు) రూం నంబర్:117లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. కౌన్సెలింగ్ హాలులోకి అభ్యర్థులను మాత్రమే అనుమతి ఇస్తారని తెలిపారు. ఖాళీలు, సీనియారిటీ జాబితాలు www.deoniza mabad.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం

ఉద్యోగాలు సాధించిన యువకులను సన్మానిస్తున్న స్థానిక నాయకులు

పొతంగల్ ,అక్టోబర్14: ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగం సాధించిన యువకులను కోటగిరి మండల కేంద్రంలో సోమవారం స్థానిక నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు అభినందించారు. శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, ఏఎంసీ వైస్ చైర్మన్ కులకర్ణి అనిల్, విండో చైర్మన్ కూచి సిద్ధు, కన్నం సాయిలు, శ్రీను, లాలయ్య తదితరులు ఉన్నారు.

అర్వింద్.. జిల్లాను స్మార్ట్ సిటీగా మార్చు..

పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

మీడియాతో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్

కంఠేశ్వర్, అక్టోబర్ 14: జిల్లాను స్మార్ట్ సిటీగా మార్చేందుకు ఎంపీ అర్వింద్ కృషి చేయాలని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సూచించారు. ఆర్వోబీల విషయంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో విలేకరుతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నదని విమర్శించారు. జిల్లాలో త్వరలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ కళాశాల ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. ప్రాణహిత 20, 21 వ ప్యాకేజీ పనులు వేగవంతం చేస్తామన్నారు. జిల్లాలో రెండో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వీలైనంత త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశవేణు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి తగ్గిన ఇన్‌ఫ్లో

మోర్తాడ్, అక్టోబర్ 14 : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో తగ్గింది. సోమవారం ప్రాజెక్ట్‌లోకి 8,590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80.5టీఎంసీలు) కాగా, ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1091 అడుగులు(80.501టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది. కాకతీయకాలువకు 5వేల క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 150, వరద కాలువకు 2వేలు, సరస్వతీ కాలువకు 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు.

గుండ్ల చెరువు పరిశీలించిన కమిషనర్

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్14: పట్టణంలో గుండ్ల చెరువును మున్సిపల్ కమిషనర్ రాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గాదేవి నిమజ్జనం సాయంత్రం పూర్తయిందన్నారు.

వరికోత మిషన్ అద్దె కోసం సంప్రదించాలి

రెంజల్, అక్టోబర్ 14 : మండల సమాఖ్య ఆధ్వర్యంలో వరి కోత మిషన్ అద్దెకు ఇస్తామని ఐకేపీ ఏపీఎం చిన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలం సీజన్‌లో పండించిన ధాన్యం కోతల కోసం ఆసక్తి ఉన్న రైతులు తమ కార్యాలయంలో సంప్రదించాలని ఏపీఎం, మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, SHAIK AMZAD S/o. SHAIK ZAKIR HUSSAIN, R/o. H.No.2-61/1, Pochamma galli, Vill. & Mdl: Nasurullabad, Dist.Kamareddy, Telangana State I State that in my education certificate /Memos/ Aadhar Card/ Pan Card my father name was wrong Mentioned as SHAIK MOWLANA instead of SHAIK ZAKIR HUSSAIN I have changed my Father Name from SHAIK MOWLANA (Old Name) to SHAIK ZAKIR HUSSAIN (New Name)

NTZ-334773

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ 4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే. ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆర్మూర్‌లో నాలుగు ఇండ్లలో చోరీ

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్14 : పట్టణంతో పాటు మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోని కేవీఆర్ కాలనీలో సోమవారం ఉ దయం దొంగలు నాలుగు ఇండ్లలో చోరీకి పాల్పడ్డారు. పోలీసు లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని రాంనగ ర్‌లో ఉన్న బాలుర పాఠశాల సమీపంలో రవి కుమార్ టీచర్, బొల్ల రఘునాథ్, బొల్ల మాధవితో పాటు మామిడిపల్లిలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. బొల్ల మాధవి గత శనివారం ఇంటికి తాళం వేసి తన తల్లి వద్దకు నిజామాబాద్ వెళ్లింది. సోమవారం ఉదయం దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి రెండు తులాల బంగారం, యాభై వేల రుపాయలు ఎత్తుకెళ్లారు. అలాగే పక్కనే ఉంటున్న బొల్ల రఘునాథ్ కుటుంబ సభ్యులతో కలిసి కరీంన గర్‌లో గల తన అత్తారింటికి వెళ్లారు. అతని ఇంటి తాళాలు పగులగొట్టి రెండు లక్షల రూపాయల నగదు, బంగారం ఎత్తు కెళ్లారు. రవికుమార్ ఇంట్లో, మామిడిపల్లిలోని ఓ ఇంటిని తాళం ధ్వంసం చేసి లోనికి వెళ్లినా ఏమీ పోలేదన్నారు. పోలీ సులు ఘటనా స్థలాలకు చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. నిజామాబాద్ నుంచి క్లూస్ టీం వచ్చి వేలి ముద్రలను సేకరించింది. అనంతరం బాధితులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తు న్నట్లు తెలిపారు.

వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్ 14 : పట్టణంలోని పెర్కిట్ చౌరస్తా వద్ద సోమవారం తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సుద్దపల్లి చిన్న గంగారాం అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పెర్కిట్‌కు చెందిన చిన్న గంగారాం ఉదయం నాలుగు గంటలకు టీ తాగడానికి పెర్కిట్ చౌరస్తా వద్ద ఓ హోటల్‌కు వెళ్తుండగా అతి వేగంగా వచ్చిన కారు గంగారాం బైకును వెనుక నుంచి ఢీ కొనడంతో ఆయన అక్కడికక్కడే మరణించాడు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కారులో ఉన్న వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

యువకుడిపై కత్తితో దాడి

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్ 14 : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని విద్యానగర్ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి వరుణ్ అనే యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి చేసి గాయపర్చాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. దుర్గామాత శోభాయాత్రలో భాగంగా వరుణ్ అనే యువకుడు ఓ యువతి పట్ల టీజింగ్‌కు పాల్పడ్డాడు. ఇది వరకే నిశ్చితార్థం అయిన ఆ యువతి తనకు కాబోయే భర్తకు ఆ యువకుడి ప్రవర్తన గురించి తెలియజేసింది. దీంతో యువతికి కాబోయే భర్త శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న వరుణ్‌పై కత్తితో దాడి చేశాడు. గాయలపాలైన వరుణ్‌ను ప్రైవేట్ దవాఖానకు తరలించారు.దాడికి పాల్పడ్డ యువకుడిపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

జాతీయ స్థాయి కథల పోటీలో ఏర్గట్ల విద్యార్థి ప్రతిభ

ఏర్గట్ల, అక్టోబర్ 14 : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న అభిలాష్ అనే విద్యార్థి జాతీయ స్థాయి కథల పోటీలో తన ప్రతిభ చూపాడని పాఠశాల తెలుగు పండితుడు ప్రవీణ్ శర్మ సోమవారం తెలి పారు. గత నెలలో మాచి రాజుల బాల సాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. తమ పాఠశాల వి ద్యార్థి అభిలాష్ రాసిన మంచి మనసు కథ ఎంపికైందని, నవంబర్ 3న విద్యార్థికి బహుమతి, ప్రశంసా పత్రం అందించనున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోమగిరి కృష్ణాచారి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

దరఖాస్తుదారులు సందేహాలు ఉంటే సంప్రదించండి

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్14: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మున్సిపల్ కమిషనర్ రాజు సోమవారం కొన్ని సూచనలు చేశారు. ఎల్ఆర్ఎస్ ప్రకియలో భాగంగా రెగ్యులరైజేషన్ చేస్తున్నామని, దరఖాస్తుదారులు ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత పత్రాలు తీసుకుని కార్యాల యానికి రావాలని సూచించారు.

'ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించింది'

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్14 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యారంగానికి బడ్జెట్‌లో పెద్దపీట వేస్తామని చెప్పి తీరా విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని యూఎస్ఎఫ్ఐ నాయకుడు సిద్దుల నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని యూఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చాయని, దీనికి యూఎస్ఎఫ్ఐ రాష్ట్రవ్యాప్తంగా మద్దతు తెలుపుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, గణేశ్, రాజు, జవహర్, సురేందర్, అఫ్తాన్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ నిమజ్జనం

కోటగిరిలో అమ్మవారి శోభాయాత్ర

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్14: పట్టణంలోని దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక వాహనాల్లో దుర్గాదేవి అమ్మవారి విగ్రహాలను ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. శోభాయాత్ర అనంతరం గుండ్ల చెరువులో నిమజ్జనం చేశారు.

కోటగిరిలో..

పొతంగల్(కోటగిరి), అక్టోబర్ 14: కోటగిరి మండల కేంద్రంలో రేణుకా ఎల్లమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దుర్గామాత శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారి విగ్రహాన్ని ఉంచి శోభాయాత్ర చేపట్టగా.. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిమజ్జనానికి తరలించారు.

పోయిరా బతుకమ్మ ఉయ్యాలో..

కమ్మర్‌పల్లిలో నిమజ్జనానికి వెళ్లే ముందు బతుకమ్మలకు పూజలు చేస్తున్న మహిళలు

మోర్తాడ్, అక్టోబర్ 14 : మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లో సోమవారం బతుకమ్మల నిమజ్జన కార్యక్రమాన్ని మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే మహిళలు గునుగు, ఇతర పూలు తీసుకొచ్చి బతుకమ్మలను పేర్చి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. బతుకమ్మ పాటలపై ఆడతూ బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేశారు. మోర్తాడ్‌లో ముసలమ్మ చెరువు, కమ్మర్‌పల్లిలో గుండ్లకుంట చెరువులో నిమజ్జనం చేశారు.